

# మాన సంరక్షణాలయ్..

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

వీధి చివర మర్రిచెట్టు. దాని క్రిందొక ముష్టివాడు.

పీక్కుపోయిన కళ్లు, దేక్కుపోయిన ఒళ్ళు, ముడతలు పడి బాగా లోతుకెళ్ళ్ళిన జానెడు కడుపు, వల్లగాకంది వంగిపోయిన మూరెడు వెన్నెముక, కీళ్లు బైటపడ్డ చేతులు, మోడు వారిన కాళ్ళు, క్షౌరం కరువై పొడుగ్గా పెరిగిన గడ్డం లేక రాగిరంగు తెచ్చుకొన్న కొబ్బరిపీచులాంటి జుట్టు, ఎండిపోయి పగుళ్లతో నిండి గొడ్డుపోయిన బంజరు పాదాలు, దవడలు కనిపిస్తున్న మొహం, గారపట్టిన పళ్లు – యిదీ పినా అవతారం!

ఎందుకో బాధపడుతున్నాడు. ఏదో గొణుక్కొంటున్నాడు.

"ప్చ్. ఎవర్నుద్ధరించటానికీ బతుకు.

ఏయాళ్ళికి ఉసురుపోతాదో, నాకీ భూమ్మీద ఏయేలకి నూకలు కరువౌతదో'' – గట్టిగానే అనుకొంటున్నాడు.

ఎంగిలి బీడిముక్క పొగ వదులుతోంది. వేడిగా ఊపిరి వదుల తున్నాడు.

ఏమనుకొంటున్నాడో !

''థూత్ ! తందీ ఓ బతుకేనా. ఛ ఛ కాల్చి మసి సెయ్యాలనిపిస్తది'' – అనేమో !

మాసి మ్రగ్గి మురిగి చిరిగి చివికి చిత్తయి పోవడానికి సిద్ధంగా ఉన్న ఆ గోచీపాతను మాటి మాటికీ చూసుకొంటున్నాడు. చిలు పడి చిట్లిపోయి ఛీ దమ్మైపోయిన టెంకాయ చిప్పను అదేపనిగా చేతిలో త్రిప్పుతున్నాడు.

ఇంతలో బక్కచిక్కి బ్రతుకాశ వదలి బలహీనంగా మూల్గుతున్న గజ్జికుక్క, తోకాడిస్తూ దగ్గరగా వచ్చింది. సరిగ్గా అప్పుడే మురికిలో దొర్లి దొర్లి పాయిఖానాల్లో తిరిగి తిరిగి మైలపడ్డ ఊరపంది గుర్రుమని చప్పుడు చేస్తూ దగ్గరికొచ్చింది.

ఏడుపొచ్చినట్టుంది వానికి

ఏంచేయాలో తోచనట్టుంది.

ఎందుకో విచారిస్తున్నాడు ఏదో బాధ. ఎవ్వని వెళ్లబుచ్చుకోవాలో! ఎవలో చెప్పుకోవాలో !

మూడు పదులైనా దాటలేదు అప్పుడే ముసలివాడయ్యాడనేమో ! ముద్దుముచ్చట్లు మురిపాలు వగైరాలకు నోచుకోలేదనేమో !

గట్టిగనే అంటున్నాడు ...

''ఏంటో ! నిక్కృష్టపు బతుకు సచ్చినా బాగున్ను. ఐనా నాలాంటోడి పీనుగని అసలెవరన్నా ఎత్తేత్తారాఅని. మున్సిపాల్టోళ్ళ కూడ యాడో దిక్కూ దివానా లేనిసోట పారేత్తారు సెత్తను పారేత్తున్నట్టు ! కుక్కలపాలే ఈ బతుకు. ముదనష్టపు బతుకు. నాదేటిబతుకు. సీ. అసలు బతుకేనా ఇది''–

మథన పడుతున్నాడు అడుక్కుతినే ఆ అభాగ్యుడు కాని వినేవాడెవడున్నాడు ?

ఎవరి దారి వారిదీలోకంలో ! అదంతే అర్థంకాని ఒక ''కంటిన్యువస్ చెయిన్ !''

''నో ఎండ్ ఫరిట్ !''

సూర్యుడు అస్తమిస్తూ ఉన్నాడు ఆకాశమంతా బాగా ఎర్రబడింది భిక్షగాడి దుపు మంటలా! ఆత్మక్షోభలా !!

ఆకలి ! ఒకటే ఆరాటం !! అయినా ఎందుకో నిర్లిప్తం !!!

''అమ్మా ! తల్లీ !!'' అనాలని లేదు. అసలు ఆ యోచనే రావడంలేదు ఎందుకో బాధపడుతున్నట్లుగా స్పష్టంగా తెలుస్తోంది.

బహుశా కంపుకొట్టున్న తనొంటిని చూసేమో !

జుగుప్స కలుగుతోంది వాడికి కడుపు తిప్పేలా వస్తున్న ఆ వాసనకి వాడే తట్టుకో లేకున్నాడు.

''సానంసేయాలి. సుబ్బరంగా ఉండాలి'' అనుకొన్నాడు.

ఎక్కడ ? ఎలా ?

వాడు లేచాడు. ఒళ్ళు విరుచుకొన్నాడు, ఆవలిస్తూ – కళ్ళు మూసుకొని పదడుగులు ముందుకు నడిచాడు కాలిబాట కనిపించింది; ఓ ఫర్లాంగు దూరం వెళ్ళాడు. ఒక మడుగు నిర్మలంగా నవ్వుతూ పిలిచింది

చుట్టూ చూసాడు. ఎవరూ లేరు ! ఆనందంపట్టలేక ఒక ఉదుటున పరుగెత్తు కెళ్ళి ఎగిరిదూకాడందులో. హాయిగా ఈద సాగాడు. ఇంతలో ఏదో గుర్తొచ్చింది. ఏదో నిర్ణయించుకొన్నాడు.

తన గోచిని తీసి నీట్లో రెండు మూడు సార్లు తడిపి బాగా పిండి గట్టు మీదున్న నల్లరాయి మీద ఆరేసాడు ఆ రాతి పక్కనున్న గడ్డిపరకల్ని తీసుకొని తనొంటిని బాగా రుద్దుకొన్నాడు – పుత్తడికి మెరుగు యిస్తున్నంత అనుభూతితో !

మూడునాలుగుసార్లు మునకలేసి ఒడ్డు కొచ్చాడు.

ఆశ్చర్యం !

గోచి లేదు. భయమూ, బాధామింగేసాయి వాణ్ణి. వాల్కు వైపులా దృష్టి సారించాడు.

తూర్పుదిక్కున ఆ గోచిని తీసుకొని ఆదరాబాదరా పరిగెత్తుతున్నాడెవడో !

''ఓరేయ్ ! నాగ్గావ్ !'' అంటూ అరిచాడు. ''పాడుసచ్చినోడు ! పాడు సచ్చినోడు !'' అంటూ తిట్టుకొంటున్నాడు.

తనకిప్పుడెలా ?


''దినమొలతో ఈదిలో కెల్తే జనం ఊర్కుంటారా ? రాల్లతో కొట్టరూ ! దయతల్లి ఏ అయ్యైనా బారుడుగుడిస్తాడా! ఊహూం ! బొక్కలో ఏయిస్తారు !''యాతన పడుతున్నాడు.

''తన గోసే కావల్సొచ్చిందా నాగ్గాడికి ! సస ! పందికొక్కునాకొడుకు ! యాటైనా తీసుకోచ్చుగా. నా కాటికొచ్చి నన్నిట్టా ఇరకాటంలో పెట్టే నాకేటి దారి ! నేనేం సేయాల !'' గింగిరు తిరుగుతున్నాడు.

ఎందరో దేవుళ్లకు మొక్కుకొంటున్నాడు. తలజుట్టు మాటి మాటికీ పీక్కొంటున్నాడు. చేసేదేమీలేక చీకటి పడేవరకు అక్కడే ఉన్నాడు.

చలిగాలి, సన్ననితుంపర, ప్రాణంపోయేలా జివ్వుమనిపిస్తున్నాయి ఎగురుకొంటూ వచ్చిన పాత 'న్యూస్ పేపర్''ని మొలకు చుట్టు కున్నాడు. కాస్తలో కాస్త తృప్తిగా నడుస్తు న్నాడు.

''ఆడ్యాడో అడావిగా తేడా లేకుండా – ఒంటిమీద నూలుపోగైనా లేకుండా గంతు లేతారట. ఏదేదో యానాది పాటలు పాడుకొంటూ ఒళ్ళు మరిసి పోతారంట. ఇంక్యాదో సముద్ర సానమని గుడ్డలిపేసి తిరుగుతారంట కదా. ఎక్కడో తెలీదుకాని



# మౌన సంరక్షణలో...

బట్టల్లేకుండా పరిగెత్తారట. దాన్ని స్ట్రీకింగ ... అదేదో అంటార్ట. ఆడబిడ్డలు కూడ మొగోళ్ళకి దేంట్లోనూ తీసిపోరట ఏంటో! కాలమిట్టా ఏడ్సింది ఈ పోలీసోళ్ళ వాళ్ళనేం సెయ్యా? ఊర్ళ్ళోరికే మా కాడి కొచ్చి అడక్కతింటారు కాని...ఛఛ! వాళ్ళదీ ఓ బతుకేనా''—

తనకు తెలిసిందను కొన్నాడు.

''ఈడ కానీ యారు! అడుక్కు తింటాంరో అంటే అదేదో సట్టమట! కాకీసొక్కరోళ్ళ జబర్దస్తీతో సస్తున్నాం. ఎదవది మాలాంటోళ్ళని పట్టించుకొనే మానుబావులొత్తారా అని? హుం! అంత వరకు నేనుంటానా అని?''

కానేపోచెట్టు క్రింద కూర్చొని ఆలోచిస్తున్నాడు.

రాత్రి పదకొండు వరకు అక్కడే కూర్చొన్నాడు. బాగా ప్రొద్దు పోయాక జానెడు కడుపుకోసం కాదు, జానెడు గుడ్డ కోసం వెదకడం ప్రారంభించాడు.

ఎదురుగా కనిపించింది.

ఆరుగజాల తెల్లగుడ్డ ఎర్ర అక్షరాలతో!

చిన్ననాటి చదువు వానాకాలంది. ఎలాగైతేనేం చదువుకొన్నాడు.

''ప...వి...త్ర...మై...న...మీ ఓటును ... కు...ప్పి...గం...తు...ల...మా...రు...తీ...రావ్... గారికి .. వేసి...గె...లి...పి...చండి. మీ...గుర్తు...పాద...మాలు...న...క్క.''

''నక్క'' నెమరేసుకొన్నాడు.

ఒక్క క్షణమాలోచించాడు. ఆ గుడ్డను తీసుకోవాలని నిర్ణయించుకొన్నాడు.

చుట్టూ చూసాడు అలికిడెక్కడాలేదు. ప్రక్కనున్న గోడెక్కాడు. కాలుజారింది. క్రిందపడ్డాడు. మొలకున్న 'పేపర్' కాస్త చినిగిపోయింది. అయినా మళ్ళీ గోడెక్కాడు. గుడ్డనందుకొన్నాడు.

సరిగ్గా అప్పుడే ''బీ ట్ పో లీ స్'' బూతుకూత ''విజిల్'' మోత వినిపించాయి. ఎర్రటోపీవాలా ''టార్చిలైటు ఫోకసూ'' కర్రి ''బూటు'' అక్కసూ రెండూ క్రిరుమన్నాయి.

ఆ భిక్షగాడికి ... ఒళ్ళు జలదరించింది.

తల తిరిగింది. మెదడు మొద్దు బారిండి. కళ్ళు బైర్లు క్రమ్మాయి. అంతే!

ఆరడుగుల ఎత్తు నుండి అటువైపుకి పడ్డాడు.

కరకుబండ రాళ్ళమీద! కత్తి మొనల ముళ్ళచెట్లమీద! కసాయినవ్వుల గాజుపెంకుల మధ్య! గుండెపగిలిన పింగాణీ ముక్కలమధ్య!

ఆ తరువాత ఆ ముష్టివాని కేమీ గుర్తు లేదు. ఇకపై గుర్తురాదు!

కాని ఆ ''కానిస్టేబుల్'' మాత్రం మరుసట్నాటి పేపర్లో చూసాడు—

''రాజ్‌నగర్ కాలనీ సమీపంలో ఉన్న ''మున్సిపల్ బర్రియల్ గ్రౌండ్'' ఆవరణలో ముష్టివాని శవం'' అనే వార్త ను.

ఆత్మహత్య చేసుకొన్నాడని పత్రికలన్నీ కూడబల్కుతున్నా కాదనిచెప్పే గుండెధైర్యం లాటీకర్రకి లేకపోయింది.

''ఆల్సేషియన్''కి ''బిస్కట్''లు తినిపించడంతోనే దానికి సరిపోయింది!

ఈ కథ కొంతవరకు నిజంగా జరిగిందే!

## కేన్సరు చికిత్సకు కొత్తపద్ధతి!

కేన్సరు చికిత్సకు జపాను శాస్త్రవేత్తలు కొత్త పద్ధతిని రూపొందించారు. దీనిని 'ఫొటో కెమొ థెరపీ' అంటారు. ఈ చికిత్సలో హెచ్ పి డి అనే రసాయన పదార్థాన్ని, ఆర్గాన్ లేసర్ కిరణాలను ఉపయోగిస్తారు. మొదట హెచ్ పి. డి. ని ఇంజెక్షన్ ద్వారా శరీరంలోకి పంపుతారు. ఇది ఇది కేన్సరు భాగాన్ని చేరుకున్న తరువాత ఆ ప్రదేశంపై ఆర్గాన్ లేసర్ కిరణాలను ప్రయోగం చేస్తారు. ఈ రెండింటి మధ్య రసాయన చర్య జరిగి కేన్సరు కణాలు నాశనమవుతాయి. ఈ పద్ధతి వలన ఇతర దుష్ఫలితాలు ఏర్పడవని చెబుతున్నారు. గత ఆగస్టు నుంచి జపాను లోని వివిధ ఆసుపత్రులలో పరీక్షలను జరిపారు. పొత్తికడుపు కేన్సరు, కంటి కేన్సరు, శ్వాసకోశాల కేన్సరుకు ఇది ఉత్తమ చికిత్స కాగలదని అంటున్నారు.


సినీతారలు

మీకు నచ్చే నలుగురి తారల సెక్సు ఫోటోసెట్ 10 రూ.
మీరు మెచ్చే ఒక నటి.నటుడి ఫోటోసెట్ 5 రూ.
నటీనటుల అడ్రసులుగల డైరీ 2 రూ.
కావలసినవారు M.O. చేయుండి.

వై.కె.మూర్తి,
దాసరివారివీధి విజయవాడ-2





సంతానము గర్భాశయ వ్యాధులు, సెక్సు అంతరంగిక సమస్యలు, సుఖ వ్యాధులు, మొలలు, చర్మ వ్యాధులకు అనుభవ చికిత్స. పోష్టుద్వారాకూడా చికిత్స కలదు

సరోజ నర్సింగ్ హోమ్,

డాక్టర్ యన్. సరోజిని, డాక్టర్ వి. మధు
H.O. కొత్తపేట చౌకు, కె. టి. రోడ్,
విజయవాడ—1.
బ్రాంచి: శిలంవారివీధి జిన్నాటవర్, గుంటూరు.
ఉబ్బసము నకు ఉత్తమచికిత్స!



మీకు బేబి/బాబు కావాలా





ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలు విరామ చెందిన సోదరీమణులు అనేకులు మా మూలికలచే సంతానవతులయి ఇచ్చినయోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణా నిపుణులు. ఉచిత వివరములకు:

శ్రీ నాగార్జున మూలిక కుటీరం,

రామాలయం వీధి, తెనాలి—2. | 2వలైను, కేదారేశ్వరపేట, విజయవాడ-3.